వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న యాదగిరి, బాబుచారి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో ఓఆర్ఆర్‌కు సమీపంలో ఖాళీగా ఉన్న హెచ్ఎండీఏ స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య, కమిషనర్ సాబేర్‌అలీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. స్థానికులు ఉదయం సాయంత్రం రోడ్డుపై నడవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని లేఖలో తెలిపారు. ఇళ్ల అనుమతి పేరుతో మనదగ్గర హెచ్ఎండీఏ కోట్లాది రూపాయలు వసూలు చేసుకొని అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. హెచ్ఎండీఏ భూమిని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు యాదయ్య, మండల కార్యదర్శి సబిత, తెలంగాణ ఉద్యమకారుడు బాబుచారి, నాయకులు చంద్రమోహన్, యాదగిరి, ఇనయ్యత్‌ఖాన్ పాల్గొన్నారు.

హిందూ పండగలపై వివక్ష ఎందుకు?


ఎదులాబాద్ చెరువులో నీటిపై తేలుతున్న వినాయక విగ్రహాలు

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు రామతీర్థ

ఘట్‌కేసర్: హిందూ పండగలంటే అధికారులు వివక్ష చూపుతున్నారని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు రామతీర్థ, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న ఎదులాబాద్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతేడాది వినాయక నిమజ్జనాన్ని దృష్టిలో పెట్టుకొని ఆగస్టు 30న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాలుగు క్రేన్లను ఏర్పాటు చేయాలని కోరగా ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు ఆ బాధ్యత అప్పగించారన్నారు. తొమ్మిది రోజుల వరకు రెండు క్రేన్లతోనే సరిపెట్టడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారని, విగ్రహాలను నీటిలో సరిగి నిమజ్జనం చేయలేదన్నారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు కనీసం తాగునీటిని ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. హిందువుల పండగల నిర్వాహణపై అధికారుల నిర్లక్ష్య ధోరణి అవలంభించడం సరికాదన్నారు.

విలీన గ్రామాల్లో వసతులపై ఫోకస్

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కాచవాని సింగారం, ప్రతాప సింగారం, కొర్రెముల, చౌదరిగూడ, వెంకటాపూర్ గ్రామాలను విలీనం చేశారు. దీంతో మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలను అనుసంధానం చేసేందుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. అయితే ఈ ఐదు గ్రామాల్లో సౌకర్యాలు కల్పించాలంటే మున్సిపాలిటీకి అదనపు వనరులను ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. ప్రస్తుతం విలీన గ్రామాల్లో పెద్దపెద్ద భవన నిర్మాణాలు అనుమతుల పరిధిని దాటి వెలుస్తున్నాయి. ఇప్పటికే భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకొన్న విలీన గ్రామస్తులు పోచారం మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అనుమతులు మంజూరు చేయాలని కమిషనర్ వీరారెడ్డిని బుధవారం కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 13, 14వ వార్డుల్లో సుమారు 25 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లు ఉద్యోగావకాశాలను కల్పించాలి



మెగా ఇంజినీరింగ్ కళాశాలలో పట్టా అందజేస్తున్న కసిరెడ్డి మాలతీరెడ్డి

మెగా విద్యాసంస్థల చైర్ పర్సన్ మాలతీరెడ్డి

ఘట్‌కేసర్: ఇంజినీర్లు స్వయం ఉపాధి పొంది ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మెగా విద్యాసంస్థల చైర్ పర్సన్ కసిరెడ్డి మాలతీరెడ్డి అన్నారు. ఎదులాబాద్ మెగా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పట్టభద్రులకు పట్టాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువ ఇంజినీర్లు దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. సమాజానికి మేలు చేసే నూతన ఆవిష్కరణలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామసుబ్రమణ్యం, వైస్ ప్రిన్సిపాల్ సాయి వెంకటకృష్ణ, హెచ్ఓడీలు, సంతోశ్, వెంకటేశ్వర్‌రావు, అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సందడిగా గణనాథుడి లడ్డూ వేలం


లడ్డూ దక్కించుకున్న కిషన్ యాదవ్


పోచారంలో లడ్డూ దక్కించుకొన్న పోచిరెడ్డి

కీసర: కీసర చౌరస్తాలో యాదవసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం స్వామివారి లడ్డూ ప్రసాద వేలం పాట సందడిగా నిర్వహించారు. కీసరకు చెందిన మచ్చాని కిషన్ యాదవ్ రూ. 2,27,500కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మండప నిర్వాహకులు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న కిషన్ యాదవ్ దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం 12 రోజుల పాటు గణనాథుడి చేతిలో పూజించిన లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు.

పోచారంలో రూ. 1.72 లక్షలు...

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పోచారం గ్రామంలో సుభాష్ చంద్రబోస్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంలో పాల్గొన్న ఆకిటి పోచిరెడ్డి అత్యధికంగా రూ. 1.72 లక్షలకు పాడుకొని లడ్డూ దక్కించుకున్నారు. తొలుత ఎస్వైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, టీం ఎస్ఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను సహించం

కాప్రా తహసీల్దార్ సుచరిత


కూల్చివేతలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుచరిత

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా మండల తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు బుధవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జవహర్‌నగర్‌లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను వదలడం లేదని, వాటిలో ఎటువంటి నిర్మాణాలు చేసినా తీవ్ర చర్యలు ఉంటాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్ వేసి కాపాడుతామన్నారు. ఇప్పటికే కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ రాయితీ కోసం... తప్పని ఎదురు చూపులు!

- ఆధార్, రేషన్, బ్యాంకు ఖాతా ఉన్నా ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- మహాలక్ష్మీ పథకం కింద లబ్ధిదారుల సంఖ్య 72,452 మంది
- జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేసిన సిలిండర్లు 1.72 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఆసరాగా ఉండేందుకు వంట గ్యాస్ సిలిండర్ రూ. 500 ఇవ్వాలనే ఉద్దేశంతో పథకాన్ని ప్రారంభించింది. రాయితీ సమయానికి రాకపోవడంతో లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. సమస్యల నివృత్తికి ప్రత్యేకంగా ప్రజాపాలన ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటు చేసినా ఫలితం అంతగా కనిపించటం లేదు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళలు గ్యాస్‌పై రాయితీ వస్తుందనే ఆశలు పూర్తిస్థాయిలో నెరవేరడం లేదని ఆందోళన చెందుతున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు...

గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ. 874 ఉండగా అందులో కేంద్రం రాయితీ రూ. 47, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చేది రూ. 328 పోగా రూ. 500కు మహాలక్ష్మి పథకం కింద సిలిండర్‌ను పొందాల్సి ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ వినియోగదారుడి ఖాతాలో వారంలోగా జమవుతుండగా, రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా వంటివి అన్నీ సక్రమంగా ఉన్నా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

- రాష్ట్రం నుంచి ఎందుకు సొమ్ము జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం లబ్ధిదారులు గ్యాస్ ఏజెన్సీలు, అధికారుల చుట్టూ రాయితీ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆందోళన వద్దు...

రేషన్ కార్డు, ఆధార్ అనుసంధానం తదితర కారణాలతో రాయితీ జమ కాకుండా ఉండొచ్చని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా పౌరసరఫరాల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సిలిండర్ తీసుకున్న తర్వాత నాలుగు రోజుల్లో రాయితీ జమ అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

గ్యాస్ కనెక్షన్లు ఇలా...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో మొత్తంగా 14,48,889 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో డబుల్ గ్యాస్ కనెక్షన్లు 8,52,468, సింగిల్ గ్యాస్ కనెక్షన్లు 5,11,324, దీపం కనెక్షన్లు 70,869, ఉజ్వల కనెక్షన్లు 2,593, కమర్షియల్ కనెక్షన్లు 11,635 ఉన్నాయి.

- మహాలక్ష్మి పథకం కింద 74,457 మంది లబ్ధిదారులు ఉన్నారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 1,72,393 సిలిండర్లు తీసుకున్నారు. వీటి కోసం ప్రభుత్వం రూ. 8.61 కోట్లు రాయితీ మంజూరు చేయగా రూ. 5.72 కోట్ల రాయితీ మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు తెలుస్తోంది.

వచ్చినా జమ కావడం లేదు...

గ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వం ఇచ్చే సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కావడం లేదని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా కార్యాలయానికి వెళ్లి అడిగితే రాయితీ వచ్చిందని చెబుతున్నారని పేర్కొంటున్నారు. బ్యాంకులో అడిగితే రాలేదంటున్నారని, ఎందుకు జమ కావడంలేదో తెలియడం లేదంటున్నారు.

నేడు అఖిల పక్ష సమావేశం

మేడ్చల్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మీ తెలిపారు. 19వ తేదీన ఉదయం 11.30 గంటలకు నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో చోరీ

ఆట వస్తువులు, కంప్యూటర్లు, వైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు

జవహర్‌నగర్: జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చోరీ జరిగిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నాలుగు రోజుల సెలవుల తర్వాత బుధవారం జవహర్‌నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు పాఠశాలకు వేసిన తాళం పగుళగొట్టి ఉండగా గమనించారు. దీంతో హెడ్ మాస్టర్ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే ఆట వస్తువులు, సర్వీస్ వైర్లు, మూడు కంప్యూటర్లు దుండగులు ఎత్తుకెళ్లారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌కు మెట్రో సర్వీసులు


కవిత, చెంగిచర్ల ఆర్టీసీ డీఎం

బోడుప్పల్: ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు రద్దీ సమయంలో మెట్రో సర్వీసులు నడపనున్నట్లు చెంగిచర్ల ఆర్టీసీ డీఎం కవిత ప్రకటించారు. చెంగిచర్లలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ బస్టాండ్ నుంచి ఉదయం 7.45 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, సికింద్రాబాద్ నుంచి ఉదయం 6.40 గంటల నుంచి సాయంత్రం 5.25 గంటల వరకు ప్రతీ 30 నిమిషాలకు మెట్రోడీలక్స్ బస్సుసౌకర్యం ఉంటుందన్నారు. ఘట్‌కేసర్ నుంచి ఆర్డినరీ బస్సులు ప్రతి 8 నిమిషాలకు ఒక బస్సు ఉందన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

జర్నలిస్టు సమస్యలు పరిష్కరించండి

కాప్రా: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తానని స్పష్టం చేశారు.

అక్రమ నిర్మాణాలకు అండ ఎవరో?


మంగళవారం అధికారులు అడ్డుకోవడంతో ఇలా...


బుధవారం కొనసాగుతున్న నిర్మాణం

- ఆక్రమ నిర్మాణమని ఆపిన గ్రామ కార్యదర్శి
- మరుసటి రోజే పునః ప్రారంభమైన పనులు
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

మేడ్చల్: డబీల్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 112 (పార్ట్), 113 (పార్ట్)లలోని వెంచర్‌లో మిగిలిన భూమిని కొంతమంది రియల్ వ్యాపారులు కొనుగోలు చేసి పేపర్ మీద 29 ప్లాట్‌లు చేసి వాటికి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న గ్రామ కార్యదర్శి ఉమాదేవి మంగళవారం ఉదయం ఆ పనులను నిలిపి వేయించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని పనులు నిలపివేయాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామానికి వెళ్లే దారి (బండ్లబాట) ఆక్రమణకు గురవుతుందని దారి వదలాలని, వెంచర్ మిగులు భూములో డబీల్‌పూర్ గ్రామానికి వెళ్లే దారి ఉందని గత ఏప్రిల్ నాటి కార్యదర్శి కలెక్టర్‌కు వివరించారు. జిల్లా రిజిస్ట్రార్‌కు ఆ భూమిలో రిజిస్ట్రేషన్లు చేయవద్దని ఫిర్యాదు చేశారు. రియల్ మోసగాళ్లు భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం పేపర్‌పై ఓ లేఅవుట్ తయారు చేసి అందులో 29 ప్లాట్లు చేశారు. ఈ దందాను 'సాక్షి' దినపత్రిక మే నెలలో 'కాగితంపైనే లేవుట్' అనే శీర్షికతో ప్రత్యేక కథనాన్ని సైతం ప్రచురించింది. ఇన్నాళ్లు మిన్నకుండిన రియల్ వ్యాపారులు మంగళవారం మిగులు భూమి చుట్టూ ప్రహరీ నిర్మించే ప్రయత్నం చేశారు. దీంతో గ్రామ కార్యదర్శి ఆ పనులను నిలిపివేయించారు. బుధవారం మాత్రం సీన్ రివర్స్ అయ్యింది. అక్రమార్కులు అధికారులు చెప్పినా పనులు యధావిధిగా నడిపిస్తూ ప్రహరీ నిర్మాణాన్ని కొనసాగించారు.

చర్యలు తీసుకుంటాం: ఎంపీఓ సునీత

అక్రమార్కులను అడ్డుకోవడంలో విఫలమైన గ్రామ కార్యదర్శి ఉమాదేవిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీఓ సునీత తెలిపారు. పూర్తి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేస్తామని స్పష్టం చేశా. నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నూతన ఆవిష్కరణలకు వేదికగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్


పోటీల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న విద్యార్థులు


పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: నూతన్ ఆవిష్కరణలను ఆవిష్కరించి తమ మేధో సంపత్తి పెంచుకునేందుకు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్(ఎస్ఐహెచ్) విద్యార్థులకు మంచి వేదికగా నిలుస్తుందని నర్సింహారెడ్డి కళాశాల డైరెక్టర్ మోహన్‌బాబు తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు గాను అంతర్గత పోటీలు నిర్వహించారు. 120 జట్లు పోటీల్లో పాల్గొని ఎస్ఐహెచ్ నిర్దేశించిన వివిధ సమస్యలకు పరిష్కారాలను చూపుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ... విద్యార్థులు నూతనంగా ఆలోచించాలని, నూతన ఆవిష్కరణల వల్ల సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, కో ఆర్డినేటర్ శోభన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీస్ వెల్ఫేర్ నూతన కమిటీ

ఉప్పల్: తెలంగాణ రిటైర్డ్ పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఉప్పల్‌లో జరిగింది. బుధవారం ఎన్నికల్లో విశ్రాంత పోలీస్ అధికారి ఎజెల్ల శ్రీనివాస్‌రావును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లకోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. మార్చ్–31 వరకు ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం ఇవ్వలేదని జీపీఎఫ్, గ్రాడ్యుటీ, ఈఎల్ మొత్తం బకాయిలు దాదాపుగా ఒక్కో ఉద్యోగికి రూ.30 నుంచి 50 లక్షల వరకు రావాల్సిఉందని దీనిపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన దృష్టికి తీసుకొస్తామని చెప్పారు.

20, 21లలో జోనల్ స్థాయి టోర్నీ కమ్ సెలక్షన్స్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, మేడిపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పట్టణంలోని శిల్పీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 20, 21న జోనల్ స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడలు, క్రీడాకారుల ఎంపిక చేయనున్నట్లు జోన్ కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. అండర్–14 బాల బాలికల సెలక్షన్స్‌లో 2011 జనవరి 1 తర్వాత జన్మించినవారు, అండర్–17 బాలబాలికలు 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు ఒరిజినల్ బోనఫైడ్, దానిపై పెన్ నెంబర్, ఆధార్ జిరాక్స్‌తో ఈ నెల 20న ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు ఫోన్స్: 92913 03090, 93900 68408లలో సంప్రదించాలని సూచించారు.

ఏఆర్‌వీ శిబిరం ప్రారంభం


ఏఆర్‌వీ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలో కుక్కల జనన నియంత్రణతో పాటు యాంటీ రేబిస్ టీకాలు (ఏఆర్‌వీ) వేసే దిశగా చర్యలు చేపట్టామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్‌కార్యాలయం వద్ద రేబిస్ ఫ్రీ తెలంగాణ బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ అండ్ మిషన్ రేబిస్ సాముహిక రాబిస్ టీకా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, పంగ హరిబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని శ్రీ విరాట్ పోతులూరి వరవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అంజయ్యచారి, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మాచారి, కోశాధికారి ఆచారి, ఉపాధ్యక్షులు విష్ణుచారి, కొండపర్తి ప్రభాకర్‌చారి, నాగరాజుచారి, వీరచారి, సంఘం గౌరవ అధ్యక్షుడు ఓంకార్‌చారి, బాలచారి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పట్టణంలో పట్టణ బీజేపీ నాయకులు నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉండే బీజేపీ అభిమానులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నాయకులు మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదు పట్టణ ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నదని... అభిమానులు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వచ్ఛతా హీ సేవా 2024లో భాగంగా బుధవారం కార్పొరేషన్ పరిధి 1వ వార్డు నుంచి 5వార్డులోని స్కూల్ విద్యార్థులకు స్వచ్ఛతా ప్రమాణం చేయించారు. అనంతరం స్వచ్ఛతపై విద్యార్థులకు పేయింటింగ్ పోటీలు, ర్యాలీ,మానవహారం, డోర్ టూడోర్ క్యాంపెన్ వంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈనెల 30 వరకు ప్రతి వార్డులో షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు తెలిపారు. 2వ వార్డు కార్పొరేటర్ శుభాష్‌నాయక్, 4వవార్డు కార్పొరేటర్ యాసారం మహేశ్వరి, 5వవార్డు కార్పొరేటర్ బొడిగె స్వాతికృష్ణగౌడ్, డీఈ సాయినాథ్‌గౌడ్, మేనేజర్ సుదర్శన్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ విద్యార్థులు, స్వయం సహాయక బృందాలు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభ

కాప్రా: కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట వారసులని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి. సాగర్ తెలిపారు. బుధవారం కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ఎలాంటి పోరాట చరిత్ర లేని కొందరు సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. నిజాంనవాబులు, రజకార్ల పాలనలో అనేక దుర్మార్గాలకు పాల్పడ్డారని, పండించిన పంటను దక్కనీయకుండా దోచుకెళ్తుంటే తిరగబడి ఎదురొడ్డి పోరాడిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని గుర్తు చేశారు. ఆంధ్ర మహాసభ సంఘం పేరుతో గురుసంఘాలను ఏర్పాటు చేసి జమీందారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్వహించారని తెలిపారు. కాప్రా సర్కిల్ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు గణేష్, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటాచారి, వెంకట్, శివ నారాయణ, నాగరాజు, యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ గణపతి ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళం

అల్వాల్: కానాజిగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ, 32 ఔషదీకృత ద్రవ్యాలతో విశేష అభిషేకం, లక్ష్మీగణపతి మహాలక్ష్మి మూలమంత్ర హవనం, మృత్యుంజయ చండీహోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అన్నదాన ట్రస్టుకు గీతప్రియా, వెంకటరావులు రూ.1,35,999 చెక్కును అందజేశారు. ఆలయ ట్రస్టీలు ఆరంజ్యోతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.